క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



బాలాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

రుద్రవరం: వెలగలపల్లె సమీపంలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి వారికి శనివారం భక్తులు విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించి ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తాదులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాలు ముగియగానే రేకుల షెడ్డులో కొలువు దీర్చిన పాత దేవతామూర్తుల విగ్రహాలను కొలువు దీర్చేందుకు బాలాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ జి.రాఘవరెడ్డి, ఆర్.నాగులవరం గ్రామ సర్పంచ్ గంధం సావిత్రమ్మ, నంద్యాలకు చెందిన ప్రముఖ వైద్యులు హరినాథ్‌రెడ్డి,లక్ష్మీప్రసన్న తదితరులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.

భారీ వర్షం



పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

దొర్నిపాడు: మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పచ్చి మిరప తదితర పంటలకు ఊరటనిచ్చింది. ఇన్నాళ్లుగా వర్షం లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రస్తుతం కురిసిన వర్షం పైర్లకు ఊపిరి పోసింది.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



డయాలసిస్ పేషంట్‌కు రూ.10వేల పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ

దొర్నిపాడు: మండలంలో నూతన పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. మండలానికి కొత్తగా 179 పింఛన్లు మంజూరు కాగా గుండుపాపల గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తుడు సూర్యనారాయణరెడ్డికి రూ.10వేల పింఛన్ మంజూరు కాగా ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు శనివారం అందజేశారు.

పింఛన్లతో పేదలకు భరోసా



నూతన పింఛన్‌దారులతో ప్రజాప్రతినిధులు

శిరివెళ్ల: వైఎస్సార్ పింఛన్ కానుక పేదలకు భరోసా ఇస్తుందని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. శనివారం స్థానిక 1వ గ్రామ సచివాలంలో నూతనంగా 46 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలానికి కొత్తగా 153 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, ఈఓఆర్డీ నాగేంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి

ఉయ్యాలవాడ: శ్రావణ మాసంను పురస్కరించుకొని శనివారం మండలంలోని సుద్దమల్ల, ఇంజేడు, ఉయ్యాలవాడ, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వాములకు కుంకుమార్చన, అభిషేకాలు, ఆకు పూజ తదితర పూజలు చేపట్టారు. అర్చకులు కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మ, లక్ష్మణ స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

6.731 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

శ్రీశైలంప్రాజెక్ట్: తెలంగాణ ప్రాంతంలోని ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో శుక్రవారం నుంచి శనివారం వరకు 6.731 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన కోసం జలాశయం నుంచి 13,464 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుని దిగువ నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల ప్రవంతికి 1507 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శనివారం సాయంత్రానికి జలాశయంలో 82.0108 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటి మట్టం 850.90 అడుగులకు చేరుకుంది.

చిరస్మరణీయుడు వైఎస్సార్



ఆళ్లగడ్డ నాలుగురోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



శ్రీనివాస సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ, పీపీ నాగిరెడ్డి, నాయకులు

నంద్యాల: సంక్షేమ పాలనతో అన్ని వర్గాల ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న మహోన్నత వ్యక్తి వైఎస్సార్ అని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డితో కలిసి పట్టణంలోని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి స్వగృహంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, అభిమానులతో కలిసి పట్టణంలోని శ్రీనివాససెంటర్, శ్యామకాల్వ, సాయిబాబానగర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు భారీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ఫుడ్‌ప్రాసెసింగ్ చైర్మన్ కల్లూరి రామలింగారెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు సునితఅమృతరాజ్, చంద్రశేఖర్, సుబ్బరాయుడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్లు దాల్ మిల్ అమీర్, సాయిరాంరెడ్డి, సలాముల్లా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రైల్వే శ్రీనివాసులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో..

వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతిని స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, నంద్యాల అసెంబ్లీ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు శివనాగిరెడ్డి, శ్రీనివాసులు, వివేకానందరెడ్డి, సుబ్బయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అలాగే.. పార్టీ విద్యార్థి విభాగం నంద్యాల పార్లమెంటరీ అధ్యక్షుడు సన్నల సాయిరాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో నాయకులు ఊకొట్టు వాసు, బాలకృష్ణ, శివరామిరెడ్డి, ప్రసాద్, మద్దిలేటి, అహమ్మద్ రహిమాన్ నివాళులర్పించారు. మండలంలోని కానాల గ్రామంలో జగదీశ్వరరెడ్డి, సర్పంచ్ బావమ్మ, నాయకులు మేఘనాథరెడ్డి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. పాండురంగాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పురుషోత్తమరెడ్డి, మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరరెడ్డి, డోలావతమ్మ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోనున్న వైఎస్సార్ విగ్రహం వద్ద ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, విజయా డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు సింగం వెంకటేశ్వరరెడ్డి,గంగుల రామిరెడ్డి, గూబగుండం వెంకటసుబ్బారెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వినోద్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు రమేష్‌గౌడ్, మాదం చెన్నయ్య, శిల్పా కళా సంఘం యూనియన్ ప్రెసిడెంట్ నీలకంఠేశ్వరరెడ్డిపాల్గొన్నారు.

రుద్రవరం: మరువలేని నాయకుడు వైఎస్సార్ అని ఎంపీపీ బాలస్వామి అన్నారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో శనివారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాల నాలుగు రోడ్ల కూడలిలో సర్పంచు బైరి విజయలక్ష్మి, నాయకులు జాకీర్,బైరి శంకర్,బ్రహ్మం,కేసీ నరసింహులు, నంబర్‌వన్ వుశేని, లింగం బ్రహ్మయ్య, లొడుగు నరసింహులు,పెద్దన్న వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం స్థానిక వైద్యశాలలో రోగులకు బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేశారు.

చాగలమర్రి: వైఎస్సార్ చిరస్మరణీయుడని వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్‌బాబులాల్ అన్నారు.శనివారం వైఎస్సార్ జయంతిని స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దమకానం సెంటర్‌లో పార్టీ మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీటీసీ ఫయాజ్, డైరెక్టర్ ముల్లా జాబీర్, నాయకులు మనోహర్‌రెడ్డి, వెంకటరమణ, రణగాని శ్రీనివాసులు, ముల్లా ఖాదర్‌బాషా, వార్డు సభ్యులు మన్సూర్, ముల్లా బురాందీన్, షరీఫ్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అలాగే..శెట్టివీడు గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీదేవి, ముత్యాలపాడులో సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్ నివాళులర్పించారు.ఉప సర్పంచ్ భారతమ్మ, చిన్న భికారి, రాధిక, బాల దస్తగిరి, టి.ఎస్.బాషా, మదార్ ఉప సర్పంచ్ ఓబులేసు, రెహమాన్, సుబ్బరాయుడు, చాంద్‌బాషా, బాబయ్య పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్థానిక సంతమార్కెట్ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేస్తో కలిసి నివాళులర్పించారు.

దొర్నిపాడు: మండల కేంద్రంలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి సభలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరావు, సొసైటీ డైరెక్టర్ భూమా చెంచిరెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శివరామిరెడ్డి, ప్రతాపరెడ్డి, డీలర్ శివుడు,శివారెడ్డి,మోహన్‌నాయుడు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

శిరివెళ్ల: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంతో పాటు గ్రామాల్లో వైఎస్సార్ చిత్ర పటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, మండల ఉపాధ్యక్షురాలు చీమల అనూష, సర్పంచులు సాలమ్మ, అయ్యలూరి సుభహాన్, జింకల నాగన్న, పెద్ది రమణయ్య, కందుల మల్లేశ్వరి, దూదేకుల ఉశేనిబీ, రఘునాథరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షురాలు మందాల రాధిక, నాయకులు ఇందూరి ప్రతాపరెడ్డి, సుబ్బసత్యానారాయణ శ్రేష్టి పాల్గొన్నారు.



శెట్టివీడులో..



శిరివెళ్లలో..



ఉయ్యాలవాడలో..



నంద్యాలలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



దొర్నిపాడులో..



నంద్యాల: వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో..



రుద్రవరంలో..



చాగలమర్రిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వాతావరణ కాలుష్యాన్ని తగ్గిద్దాం



సూచనలిస్తున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి

నంద్యాల(వ్యవసాయం): ఫ్యాక్టరీల నుంచి వచ్చే విష వాయువుల ద్వారా ఏర్పడే వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి సూచించారు. శనివారం కోర్టు ఆవరణలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో వాతావరణ పరిరక్షణ, చైల్డ్ ప్రొటక్షన్, భూసేకరణ శాఖాధికారులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ వాయు, నీటి, శబ్ద, భూ కాలుష్యాలను నివారించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే చిన్న పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని చెప్పారు. భూ సేకరణ సమస్యలకు లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు, తెలుగుగంగ, ఎస్సార్‌బీసీ, ఆర్‌అండ్‌బీ, రైల్వే అధికారులు, డిప్యూటీ ఈఓ మహబూబ్ బేగ్, ఎంఈఓలు, జిల్లా బాలల పరిరక్షణ శాఖాధికారులు, మండల లీగల్ సెల్ అధికారులు రామచంద్రారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీడీపీఓ చంద్రకళ

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, అలా కాదని వివాహాలు చేసిన వారిపై గ్రామ స్థాయిలో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు కేసు నమోదు చేయవచ్చని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ, ఎస్‌బీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టులో శనివారం ప్రాజెక్టు పరిధిలోని మహిళా పోలీసు, ఏఎన్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్లకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయిలో బాల్య వివాహాల నిరోధక, పర్యవేక్షక కమిటీలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయ, సుజాత, శివకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

నంద్యాల(అర్బన్): స్థానిక టెక్కె మార్కెట్ యార్డులో శనివారం యూకేకు చెందిన లిటిల్ డ్రాప్స్ చారిటబుల్ ట్రస్టు సహకారంతో విద్యార్థులకు విద్యాసామగ్రితో పాటు పోషవిలువలు కలిగిన బియ్యం పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు, కౌన్సిలర్ వాసగిరి విజయ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ కాల్వ సరస్వతి, వైద్యులు శ్రీనివాసరావు, సచిన్, నిషిప్రియ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి



మాట్లాడుతన్న ఎంపీపీ ఆర్థర్ సైమన్

గోస్పాడు: గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలని ఎంపీపీ ఆర్థర్ సైమన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో మండలం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసిందని, అధికారులు, సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో వారికి తగిన సేవలు అందించడంతోపాటు సచివాలయాల ద్వారా అర్హులందరికీ పథకాలు అందేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు నిర్వహించాలని, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కొత్తగా 237 మందికి పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. వైస్ ఎంపీపీ రాజు, ఇన్‌చార్జ్ తహసీల్దారు విజయ శేఖర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలోవెలసిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారికి శ్రావణమాసం శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ ముగించి పట్టువస్త్రాలతో అలంకరింపజేసి మహామంగళ హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం గణపతి హోమం, నవగ్రహ, సుదర్శన హోమాలు జరిపించి పూర్ణాహుతి గావించారు. కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఇంటికే వచ్చి పింఛన్ సొమ్మును అందజేయడం దేశంలో ఏ రాష్ట్రంలో లేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన పింఛన్ పథకాన్ని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు హర్షిస్తున్నారని జేసీఎస్ పట్టణ కన్వీనర్ సన్నల సాయిరాంరెడ్డి కొనియాడారు. ఇటీవల 15వ వార్డులో కొత్తగా పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి శనివారం పాలాభిషేకం నిర్వహించారు.

ఆర్థిక సాయం

రుద్రవరం : మండలంలోని మందలూరు గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులకు సర్పంచ్ నిర్మలాదేవి ఆధ్వర్యంలో నాయకులు, అధికారులు శనివారం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సుంకమ్మ, దస్తగిరి, సిద్దమ్మ,గంగన్నకు చెందిన పూరిగుడిసె కాలి బూడిదైంది. బాధితులను నాయకులు శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వీరశంకర్‌రెడ్డి, వీఆర్వో ఫకృద్దీన్, వర్క్ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తదితరులతో పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున అందజేశారు. పక్కా గృహాలకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.

గడ్డి వాముల దగ్ధం



కాలిపోతున్న పశుగ్రాసం

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరులో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గడ్డివాములు దగద్ధమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మునగాల నరసింహారెడ్డి అనే రైతు గత రబీ సీజన్‌లో పశువుల మేత కోసం తన సొంత పొలంలోని గ్రాసంతో పాటు ఇతర రైతుల నుంచి దాదాపు రూ.లక్ష విలువజేసే గ్రాసాన్ని కొనుగోలు వాములుగా వేశాడు. మధ్యాహ్నం ఉన్నట్టుండి గడ్డి వాముల నుంచి మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టు పక్కల వారు మంటలను ఆర్పేందుకు యత్నించారు. సాధ్యం కాకపోవడంతో ఆళ్లగడ్డ అగ్ని మాపక శాఖ సిబ్బందికి సమాచారమివ్వగా వారు వచ్చేలోపు వాములు కాలి బూడిదయ్యాయి.

ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు

దొర్నిపాడు: పొలం విక్రయించేందుకు అడ్వాన్స్‌గా తీసుకున్న రూ.5లక్షలు తిరిగి ఇవ్వక పోవడంతో పాటు పొలం విక్రయించకుండా కాలయాపన చేస్తున్న విశాలక్షమ్మ, రఘురాముడు అనే ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కోవెలకుంట్లకు చెందిన నరసింహ అనే వ్యక్తికి పొలం అమ్మేందుకు దొర్నిపాడుకు చెందిన విశాలక్షమ్మ, రఘురాముడు అడ్వాన్స్‌గా రూ.5లక్షలు తీసుకున్నారు. పొలం రిజిస్ట్రేషన్ చేయించాలని కోరగా మరో రూ.5లక్షలు ముందస్తుగా ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేయిస్తామని స్పష్టం చేశారు. అయితే తన అడ్వాన్స్ వెనక్కి ఇవ్వాలని కోరగా ఇచ్చేది లేదని బెదిరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మందులు నిషేధం.. విక్రయాలు వాస్తవం

జీవావరణ సమతుల్యతను కాపాడటంలో భాగంగా ప్రభుత్వం వివిధ రకాల చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అంతరించిపోతున్న రాబందుల పరిరక్షణలో భాగంగా డైక్లోఫినాక్ వినియోగాన్ని నిషేధిస్తూ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. దీని స్థానంలో కెటోప్రొఫెన్, అసిక్లోఫినాక్ వినియోగం పెరిగిపోయింది. వీటి నుంచి కూడా వాటి మనుగడ పూర్తిగా ప్రశ్నార్థకంగా మారిందని గ్రహించి వాటిని కూడా నిషేధిస్తూ జూలై 31న కుటుంబ సంక్షేమ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయినా జిల్లాలో వాటి విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

- యథేచ్ఛగా నిషేధిత పశుమందుల విక్రయాలు
- కెటోప్రొఫెన్, అసిక్లోఫినాక్ మందులను నిషేధించిన కేంద్రం
- జూలై 31న నోటిఫికేషన్ జారీ
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న అమ్మకాలు
- పశువులు, రాబందుల సంరక్షణలో భాగంగా చర్యలు

నంద్యాల(సెంట్రల్): పశువుల చికిత్సలో ప్రతికూల ప్రభావాలు చూపటంతో పాటు, రాబందులు అంతరించి పోవటానికి కారణమవుతున్న కెటోప్రొఫెన్, అసిక్లోఫినాక్ మందులను ప్రమాదకారకాలుగా పరిగణించి పశు వినియోగంపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. కానీ జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాలు, గ్రామాల్లోని మందుల దుకాణాల్లో వీటిని నిరాటంకంగా అమ్ముతున్నారు. జిల్లా కేంద్రంలోని పలు వెటర్నరీ ఫార్మసీల్లో శనివారం సాక్షి జరిపిన క్షేత్రస్థాయి పరిశీలనలో అమ్మకాల గుట్టు తెలిసింది.

రాబందుల రక్షణకు..

జీవావరణ వ్యవస్థ సమతుల్యతను కాపాడటంలో రాబందులది కీలక పాత్ర. చనిపోయిన పశువుల కళేబరాలను తిని ఇవి బాక్టీరియా, వైరస్‌ల వ్యాప్తిని నిరోధిస్తాయి. కానీ పశువులకు వచ్చే పలు రోగాల చికిత్సలో భాగంగా వాడే డైక్లోఫినాక్, పాల ఉత్పత్తిపై ప్రభావం చూపే ఆక్సిటోసిన్ ఔషధాలతో నిండిన కళేబరాలను తినటంతో అవి పెట్టే గుడ్లకు పై పొర లేకుండా పెడుతుండటంతో వాటి సంఖ్య భారీగా తగ్గిపోయింది. దీంతో 2006లో పశువైద్యానికి డైక్లోఫినాక్, ఆక్సిటోసిన్‌ను 2018 జూలై 1న నిషేధించారు. దీని స్థానంలో కెటోప్రొఫెన్, అసిక్లోఫినాక్ వినియోగాన్ని ప్రారంభించారు. కాలక్రమంలో ఇవి కూడా ప్రమాదకరంగా పరిణమించటంతో ఇటీవల నిషేధిత జాబితాలో చేర్చారు. కేంద్ర ఔషధ నియంత్రణ ప్రామాణిక సంస్థ (సీడీసీఎస్ఓ) పరిధిలోని ఔషధ సాంకేతిక సలహా బోర్డు 89వ సమావేశం అనంతరం నిషేధానికి సంబంధించి కేంద్రం గెజిట్ విడుదల చేసింది. నిషేధం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. దీంతో ఈ రెండు ఔషధాల ఉత్పత్తి, పంపిణీ, అమ్మకాలు చట్టవ్యతిరేకంగా ప్రకటించింది. ఈ మేరకు జూలై 31న ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఓ నోటిఫికేషన్‌ను సైతం విడుదల చేసింది. ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం-1940లోని సెక్షన్ 26ఏ ప్రకారం నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో కెటోప్రొఫెన్, అసిక్లోఫినాక్ నిషేధం, ప్రత్యామ్నాయాల గురించి స్పష్టంగా పేర్కొంది.

అమలుకు నోచుకోని ఆదేశాలు..

నిషేధం అమల్లోకి వచ్చి నెలకు పైగానే గడుస్తున్నా జిల్లా వ్యాప్తంగా అమ్మకాలు మాత్రం ఆగలేదు. దుకాణదారులకు అవగాహన కల్పించకపోవటం, ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు రాకపోవటంతో అమ్మకాలు కొనసాగుతున్నాయి. దీనిపై జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి గోవిందనాయక్‌ను వివరణ కోరగా... సదరు మందులను నిషేధించిన విషయం వాస్తవమేనని, వీటి కట్టడిపై ఉన్నతాధికారుల నుంచి ఇంకా ఎటువంటి ఆదేశాలు రాలేదని తెలిపారు.



నంద్యాల బస్టాండ్ సమీపంలోని ఓ వెటర్నరీ ఫార్మసీలో అమ్ముతున్న కెటోప్రొఫెన్ మందు



MINISTRY OF HEALTH AND FAMILY WELFARE
(Department of Health and Family Welfare)
NOTIFICATION
New Delhi the 31st July, 2023
[F. No.X.11035/65/2023-DRS]
ARADHANA PATNAIK, Jt. Secy.

మందులను నిషేధిస్తూ కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్